క్లుప్తంగా

గుడ్డుతో ఆరోగ్య ప్రయోజనాలు



గుడ్లను పంపిణీ చేస్తున్న విఠల్‌రెడ్డి

కాకినాడ రూరల్: శారీరక ఆరోగ్యానికి గుడ్డు ప్రయోజనం చేకూరుస్తుందని లయన్స్ క్లబ్ కాకినాడ ప్రొఫెషనల్ సభ్యుడు ద్వారంపూడి విఠల్‌రెడ్డి అన్నారు. స్థానిక రమణయ్యపేటలోని అడబాల ట్రస్ట్ కార్యాలయం వద్ద ఆదివారం ఉచితంగా గుడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గుడ్డులో విటమిన్-ఎ, పొలేట్, విటమిన్-బి12, భాస్వరం, కాల్షియం, జింక్, విటమిన్-డి ఉంటాయని వివరించారు. వీటి ద్వారా శరీరానికి పోషకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు నిమ్మకాయల వెంకటేశ్వరరావు, డాక్టర్ సువర్ణరాజు, అడబాల రత్నప్రసాద్, డాక్టర్ శిరీష, చింతపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

డీఎస్‌ఏలో సామూహిక సూర్య నమస్కారాలు



సూర్య నమస్కారాల కార్యక్రమంలో పాల్గొన్న డీఎస్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): సామూహిక సూర్య నమస్కారాల కార్యక్రమం కాకినాడ జిల్లా క్రీడా మైదానంలోని టెన్నిస్ కోర్టుల ఆవరణలో ఆదివారం డీఎస్‌డీఓ బి.శ్రీనివాస్‌కుమార్ ఆధ్వర్యంలో జరిగింది. 108 సూర్య నమస్కారాలు చేసి, వీటి విశిష్టతను అతిథులు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆదిగురు యోగా పీఠం వ్యవస్థాపకుడు సచ్చిదానంద యోగి స్వామి, పీఈటీ సంఘ జిల్లా అధ్యక్షుడు వి.రవిరాజు, ఏపీ యోగా విద్యా పీఠం అధ్యక్షుడు చిట్టూరి చిట్టిబాబు, యోగా భరత్ జాతీయ జడ్జి వీవీఎస్ మూర్తి, డీఎస్ఏ యోగా కోచ్‌లు సత్యనారాయణమూర్తి, ఇందిరాదేవి పాల్గొన్నారు.

దంత సంరక్షణపై అవగాహన



దంత ఆరోగ్యంపై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: నోటిపై శ్రద్ధ చూపితేనే ఆరోగ్యం పదిలంగా ఉంటుందని కాకినాడ ఐడీఏ కార్యదర్శి డాక్టర్ అడ్డాల సత్యనారాయణ అన్నారు. జాతీయ దంత క్షయ నివారణ దినం సందర్భంగా అడబాల ట్రస్ట్, కాకినాడ ఐడీఏ సంయుక్తంగా దంత ఆరోగ్యంపై ఆదివారం స్థానిక రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అవగాహన సదస్సు నిర్వహించారు. దంత సంరక్షణపై అవగాహనతో పాటు, వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ అడ్డాల మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రోజుకు రెండు సార్లు బ్రష్ చేసుకోవాలని, ఆహారం తీసుకున్నాక నోరు శుభ్రంగా పుక్కిలించాలన్నారు. ఆహార పదార్థాలు దంతాలపై పేరుకుపోకుండా చూసుకోవడం ద్వారా దంత క్షయాన్ని నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఐడీఏ సభ్యులు డాక్టర్ శ్రీవల్లి, డాక్టర్ సిరాజ్, అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ప్రదర్శనలో బాలికల ప్రతిభ



బహుమతులతో విద్యార్థులు

బాలాజీచెరువు: రేవతి బాలికల ఫౌండేషన్ ఇటీవల నిర్వహించిన సైన్స్ ప్రదర్శనలో గీతమ్ పాఠశాల బాలికలు ప్రతిభ కనబరిచారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా వంద మందికి పైగా పాల్గొన్నారు. విద్యార్థి విభాగం జూనియర్ కేటగిరీలో జ్ఞానశ్రీత, దేవినిఖిత ప్రథమ స్థానం, రిషిత, విద్యాశాలిని తృతీయ స్థానం సాధించారు. అలాగే ఉపాధ్యాయిని విభాగంలో బయాలజీ టీచర్ జయంతి ద్వితీయ స్థానం సాధించారు. విజేతలకు నగదు బహుమతితో పాటు, సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేశారు.

పసి పాపకు తీవ్ర గాయాలు

కాకినాడ క్రైం: వేడిగా ఉన్న టీ శరీరంపై ఒలికిన ఘటనలో ఓ పసిపాప తీవ్ర గాయాలపాలైంది. లచ్చిరాజువారి వీధికి చెందిన 14 నెలల ఎం.యోషిత సాయిశ్రీ ఆదివారం సాయంత్రం ఇంట్లో ఆడుకుంటోంది. కుటుంబ సభ్యులు తాగేందుకు టీ సిద్ధం చేసుకొని, నేలపై ఓ పాత్రలో ఉంచారు. బాలిక ఆడుకుంటూ ఆ పాత్రను తాకింది. పాత్రలో ఉన్న టీ పాపపై పడడంతో ఛాతి భాగంలో తీవ్ర గాయాలయ్యాయి. తండ్రి వినోద్‌కుమార్ ఆ బాలికను కాకినాడ జీజీహెచ్‌కు తరలించగా, చికిత్స అందిస్తున్నారు. కాకినాడ టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం

- దుర్వాసనతో ప్రజలకు తప్పని అవస్థలు
- దోమలతో నిత్యం సతమతం
- నెలల తరబడి పూడికలు తీయని వైనం
- కాకినాడ స్మార్ట్ సిటీలో ఇదీ దుస్థితి



రాజేశ్వరినగర్‌లోని ఓ డ్రైనేజీలో పేరుకున్న పూడిక

బోట్‌క్లబ్: నగరంలో ఏ డ్రైనేజి చూసినా నిండుకుండలా కనిపిస్తోంది. ఇంటిలోని మురుగునీరు పోయే దారి లేకపోవడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. నెలల తరబడి డ్రైనేజీలో పూడికలు తీయకపోవడంతో డ్రైనేజీ పూడుకుపోతుంది. దీంతో మురుగునీరు కూడా డ్రైనేజీలో ప్రవహించే పరిస్థితి లేక ప్రజలు నిత్యం దుర్గంధాన్ని భరిస్తూ జీవనం సాగించాల్సిన పరిస్థితి నెలకొంది. గతంలో రెండు, మూడు రోజులకోసారి పారిశుద్ధ్య సిబ్బంది డ్రైనేజీలో పూడికలు తొలగించేవారు. ప్రస్తుతం నెలల తరబడి డ్రైనేజీలు శుభ్రం చేయకపోవడంతో, వాటి నుంచి దుర్వాసన వెదజల్లుతూ రోడ్డుర వెళ్లేవారు ముక్కు మూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది.

కాకినాడ కార్పొరేషన్‌లో వెయ్యి మందికి పైగా పారిశుద్ధ్య సిబ్బంది విధులు నిర్వహిస్తున్నారు. అయినప్పటికీ డ్రైనేజీలు మాత్రం శుభ్రం చేయడం లేదు. దీంతో రాత్రి సమయాల్లో దోమల ఉధృతి కారణంగా ప్రజల కంటిపై కునుకు కరవవుతోంది. కార్పొరేషన్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులున్న ప్రాంతాల్లో మాత్రం పారిశుద్ధ్య సిబ్బంది ప్రతిరోజూ రోడ్లు శుభ్రం చేసి, డ్రైనేజీల్లోని చెత్తాచెదారం తొలగిస్తున్నారు. మిగిలిన ప్రాంతాల్లో మాత్రం డ్రైనేజీలను శుభ్రం చేయడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాంతాల్లో నివసించే వారికి నిత్యం ఇబ్బందులు తప్పడం లేదు.

ఇక్కడ మరీ అధ్వానం

ఒకటో డివిజన్‌లోని బోట్‌క్లబ్ పార్కు ఎదురుగా ఉన్న వీధిలో రెండు నెలలుగా డ్రైనేజీని శుభ్రం చేయలేదు. స్థానిక విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులోని డ్రైనేజీని నెల రోజులుగా పట్టించుకోలేదు. దీంతో డ్రైనేజీలో మురుగునీరు కూడా పోయేదారి లేక ఆయా ప్రాంతాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో వారానికోసారి తప్పనిసరిగా డ్రైనేజీలో చెత్తాచెదారం తీయడంతో, ఇళ్లల్లోని మురుగునీరు శుభ్రంగా పోయేది. ప్రస్తుతం నెలల తరబడి డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో అవి నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. స్థానిక రామారావుపేటలో, ఎల్‌బీనగర్‌లో ప్రధాన డ్రైనేజీలు అధ్వానంగా తయారయ్యాయి. మురుగునీరు ప్రవహించకపోవడంతో దోమలకు నిలయాలుగా మారుతున్నాయి.

రాత్రివేళ దోమలతో అవస్థలు

చీకటిపడితే చాలు దోమలు నిత్యం ఇళ్లలోకి వచ్చి ప్రజలు నిద్రపోకుండా చేస్తున్నాయి. డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమలు ఆవాసాలు ఏర్పాటు చేసుకుంటున్నాయి. దీంతో చీకటిపడితే ఇంటి తలుపులు తీయాలంటేనే కొన్ని ప్రాంతాల్లో ప్రజలు భయపడాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయాల్లో దోమలు పడుకోనివ్వడం లేదని స్థానిక విద్యుత్‌నగర్, భగవతి మార్గ్, నాన్సీ స్ట్రీట్ ప్రజలు వాపోతున్నారు. గతంలో దోమల నియంత్రణకు ఫాగింగ్ యంత్రాలు వినియోగించే వారని, ప్రస్తుతం ఎక్కడా ఫాగింగ్ చేయడం లేదని చెబుతున్నారు. అందుకే రోజురోజుకూ దోమలు పెరుగుతున్నాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కార్పొరేషన్ అధికారులు స్పందించి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఇటీవల దిశ కమిటీ సభ్యులు కాకినాడ నగరంలో దోమల బెడదపై కలెక్టర్ షణ్మోహన్ సగిలికి, నగరపాలక సంస్థ కమిషనర్ భావనకు వినతిపత్రాలు ఇచ్చారు. అయినప్పటికీ దోమల నిర్మూలనకు ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు.



విద్యుత్‌నగర్ ఐడియల్ కళాశాల రోడ్డులో ఇలా..

కొరవడిన పర్యవేక్షణ

ప్రతి రోజూ పారిశుద్ధ్య సిబ్బందికి కొన్ని వీధులు శుభ్రం చేసేలా మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్లు విధులు కేటాయిస్తారు. కొందరు సిబ్బంది విధులకు వచ్చి శుభ్రం చేస్తున్నట్లు ఫొటోలు తీసి, అధికారులకు అప్‌లోడ్ చేసి, తమ సొంత పనులు చూసుకునేందుకు వెళ్లిపోతున్నారనే ఆరోపణలున్నాయి. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు.

వర్షం వస్తే రోడ్డుపైనే..

డ్రైనేజీల్లో సిల్ట్ పేరుకుపోవడంతో వర్షం వస్తే డ్రైనేజీల్లోకి వర్షపునీరు పోయే పరిస్థితి లేదు. దీంతో రోడ్డుపైనే వర్షపునీరు ఉండిపోవడంతో, రోడ్లు ఏరుల్లా తయారవుతున్నాయి. వర్షం వస్తే మురుగునీరు, వర్షపునీరు కలిసిపోయి రోడ్డుపైన చేరడంతో, రోడ్డుపై వెళ్లాలంటే ప్రజలు భయపడుతున్నారు.

పట్టించుకోవడం లేదు



మా వీధిలో డ్రైనేజీ శుభ్రం చేసి సుమారు నెల రోజులు కావస్తుంది. డ్రైనేజీలో చెత్తాచెదారం పేరుకుపోవడంతో మురుగునీరు పారడం లేదు. పారిశుద్ధ్య సిబ్బంది బాగా ఉన్న రోడ్లు శుభ్రం చేసి వెళుతున్నారు మినహా, డ్రైనేజీలో చెత్తాచెదారం తీయడం లేదు. డ్రైనేజీలో చెత్తను తీయమన్నా.. తామింకా చాలా వీధులు శుభ్రం చేయాలని, ఖాళీ లేదని సమాధానం చెబుతున్నారు.

– గౌతు చిన్న, మధురానగర్

దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి



డ్రైనేజీలు అధ్వానంగా ఉండడంతో దోమల ఉధృతి ఎక్కువగా ఉంది. రాత్రి సమయంలో దోమలు ఎక్కువగా రావడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. కార్పొరేషన్ అధికారులు దోమల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

– కె పద్మజ, రాజేశ్వరినగర్

మంచు పరదాల మాటున..



కరపలో రహదారిపై మంచు పరదా



కరపలో సామూహిక రక్షిత మంచినీటి చెరువు ఇలా..

కరప: పల్లెను కమ్మేసిన పొగమంచు ప్రకృతి తెరపై మనోహర దృశ్యాలను ఆవిష్కరించింది. మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం ఉదయం 7.30 వరకు దట్టంగా పొగ మంచు కమ్మేసింది. మాఘమాసం ప్రారంభమై 11 రోజులైనా పొగ మంచు విపరీతంగా కురియడంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యారు. వాహనచోదకులు రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులకు గురయ్యారు. పొగ మంచు ఎక్కువగా ఉండడం వల్ల దారి కానరాక లైట్లు వేసుకుని వాహనాలు నడిపారు.



మామిడి తోటను కమ్మేసిన పొగ మంచు



కరపలో ఉదయం 7.30కు భానూదయం

విద్యా ప్రదాత, త్యాగశీలి నాయకర్



నాయకర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

కాకినాడ సిటీ: నగరంలోని జగన్నాథపురం ఎంఎస్ఎన్ చారిటీస్ వ్యవస్థాపకుడు, మహాదాత మల్లాడి సత్యలింగం నాయకర్ 110వ వర్ధంతి ఆదివారం చారిటీస్ ఆవరణలో నిర్వహించారు. ముఖ్యఅతిథి, చారిటీస్ వంశపారంపర్య ధర్మకర్త, చైర్మన్ మల్లాడి కార్తీక్ నాయకర్ మాట్లాడుతూ, స్ఫూర్తి ప్రదాత నాయకర్ అని కొనియాడారు. ఆయన విద్యాభివృద్ధికి సర్వస్వం త్యాగం చేసిన త్యాగశీలి నాయకర్ నివాళులర్పించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన చారిటీస్ సహాయ కమిషనర్, ఈఓ, కరస్పాండెంట్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. మహాదాత నాయకర్ ఆశయ సాధనకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పూర్వ ధర్మకర్తల మండలి సభ్యులు పొన్నమండ విజయకుమార్, డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జి.ఉషారాణి, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.విజయకుమారి, హైస్కూల్ హెచ్‌ఎం ఎంఎస్ సుబ్రహ్మణ్యం, ప్రాథమిక పాఠశాలకు చెందిన బి.గంగాధరరావు, వేద గురువు ఎస్‌టీవీ అవధాని తదితరులు పాల్గొన్నారు. వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు.

ఆర్టీసీ డ్రైవర్‌పై కత్తితో దాడి



చికిత్స పొందుతున్న సూరిబాబు

కరప: పాతకక్షల నేపథ్యంలో ఆర్టీసీ డ్రైవర్‌పై ఆటో డ్రైవర్ కత్తితో దాడిచేసిన ఘటన వేళంగిలో జరిగింది. పోలీసుల వివరాల మేరకు, కూరాడ గ్రామానికి చెందిన ఆర్టీసీ డ్రైవర్ కేదాసి సూరిబాబుకు, అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ మేడపాటి శ్రీనివాసరావుకు ఏడాది క్రితం ఓ కార్యక్రమంలో భోజనాల వద్ద గొడవ జరిగింది. దీనిపై శ్రీనివాసరావు కక్ష పెంచుకున్నాడు. ఆదివారం మధ్యాహ్నం వేళంగి మద్యం షాపు సమీపంలో సూరిబాబు ఫోన్ మాట్లాడుతుండగా, అక్కడకు ఆటోలో వచ్చిన శ్రీనివాసరావు కత్తితో అతడిపై దాడి చేశాడు. ఈ ఘటనలో సూరిబాబు కుడి చేతికి గాయం కాగా, ఎడమ చేతి బొటన వేలు తెగిపోయింది. ప్రాణభయంతో సూరిబాబు అక్కడి నుంచి పారిపోయాడు. ఘటనా స్థలం వద్ద కత్తిని పడేసి శ్రీనివాసరావు పరారయ్యాడు. గాయపడిన సూరిబాబును స్థానికులు కాకినాడలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. ఎస్సై టి.సునీత కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు.

సీఆర్‌టీ సిలబస్‌తో ఉద్యోగావకాశాలు



ఉద్యోగాలు సాధించిన విద్యార్థులు

బాలాజీచెరువు: రెగ్యులర్ సిలబస్‌తో పాటు, సీఆర్‌టీ శిక్షణ ఇవ్వడం వల్ల డిగ్రీ విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నట్లు వీఎస్ లక్ష్మీ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వి.సంధ్య అన్నారు. కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో ఉద్యోగాలు సాధించిన 15 మందిని ఆదివారం ఆమె అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల నుండి ఇంటర్మీడియెట్ తెలుగు మీడియంలో అభ్యసించిన వారు.. డిగ్రీలో చేరిన ప్రథమ సంవత్సరం నుంచి కమ్యూనికేషన్స్‌పై శిక్షణ ఇస్తున్నామని వివరించారు. ఈ ఏడాది 60 మంది ఎంపిక కాగా, మరికొన్ని ఫలితాలు రావాల్సి ఉందన్నారు. ప్రముఖ సంస్థలు ఫస్ట్‌సోర్స్, జెన్‌ప్యాక్, ఇన్ఫోటిక్, విప్రో, టెక్ మహీంద్ర, హెక్సావేర్, ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ వంటివి రూ.2.5 లక్షల నుంచి రూ.3 లక్షల మధ్య ప్యాకేజీని ప్రారంభ దశలో అందజేస్తున్నాయన్నారు. ఎంపికైన విద్యార్థులను కళాశాల టీపీఓ ఎంవీవీఎస్ శర్మ, అధ్యాపకులు అభినందించారు.

ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు చర్యలు

- ఆర్డీవో మల్లిబాబు

కాకినాడ సిటీ: డివిజన్ పరిధిలో అభ్యంతరం లేని ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణకు సంబంధించి మరో కీలక ముందడుగు పడిందని ఆర్డీవో ఎస్.మల్లిబాబు ఆదివారం విలేకర్లకు తెలిపారు. ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగకుండా, సులువుగా క్రమబద్ధీకరణ చేసుకునేందుకు అవకాశం దక్కిందన్నారు. ఈ పథకానికి సంబంధించి మీ-సేవ కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా దరఖాస్తు చేసుకునే విధానాన్ని అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. జీవో నంబర్ 30ని అనుసరించి ల్యాండ్ రెగ్యులరైజేషన్ స్కీం-2025 పేరిట భూముల క్రమబద్ధీకరణ చేపడతామన్నారు. ఈ ఏడాది డిసెంబర్ 31 వరకు గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. క్రమబద్ధీకరణ పట్టాలను మహిళల పేరిట మాత్రమే జారీ చేస్తామన్నారు. 150 గజాల వరకు ఉచితంగా క్రమబద్ధీకరణ చేస్తామని, రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించక్కర్లేదని తెలిపారు. దారిద్ర్య రేఖకు దిగువన ఉండి, 151 నుంచి 300 గజాలలోపు ఆక్రమణలకు బేసిక్ ధరలో 15 శాతం, రిజిస్ట్రేషన్ ఫీజులో 50 శాతం చెల్లించాలని, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్నవారు పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. 300 నుంచి 450 గజాల పరిధిలో బీపీఎల్ కుటుంబాల వారు వందశాతం బేసిక్ ధర, 50 శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాలని, దారిద్ర్య రేఖకు ఎగువన ఉన్న వారు 200 శాతం బేసిక్ ధర, పూర్తి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. అదే విధంగా 450 గజాలకు మించిన ఆక్రమణలో ఎవరున్నా బేసిక్ ధరకు ఐదు రెట్లు, వంద శాతం రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి క్రమబద్ధీకరించుకోవలసిన ఉంటుందని వివరించారు. లే అవుట్ స్థలాలు, కాలువలు, నదీ ప్రవాహ గట్లు, మాస్టర్ ప్లాన్, జోనల్ ప్లాన్‌లో నిర్దేశిత స్థలాలు, జల వనరులకు సంబంధించిన స్థలాల్లో క్రమబద్ధీకరణ కుదరదన్నారు. లబ్ధిదారులు, కుటుంబ సభ్యులు ఐటీ చెల్లింపుదారులై ఉండరాదన్నారు. నాలుగు చక్రాల వాహనం ఉండరాదని స్పష్టం చేశారు. గరిష్ఠంగా గ్రామాల్లో నెలకు రూ.10 వేలు, పట్టణాల్లో నెలకు రూ.14 వేల ఆదాయం ఉన్నవారు ఈ రిజిస్ట్రేషన్లకు అర్హులన్నారు. నెలకు రూ.300లోపు విద్యుత్ చార్జీల చెల్లింపు ఉండాలన్నారు. మెట్ట, మాగాణి కింద కలిపి 10 ఎకరాలకు మించరాదన్నారు. ఆర్‌సీసీ రూఫ్, ఆస్‌బెస్టాస్ రూఫ్‌తో, ఇటుక గోడలతో నిర్మాణాన్ని పరిగణనలోకి తీసుకుంటామని వివరించారు. ఆస్తిపన్ను చెల్లింపు, విద్యుత్, వాటర్ బిల్లులను పరిగణనలోకి తీసుకుంటామని చెప్పారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులనూ పరిగణనలోకి తీసుకుంటామని తెలిపారు.

ఎన్నికల నియమావళికి తూట్లు



కాకినాడ ఆర్టీవో కూడలిలో తుమ్మల బాబు కటౌట్

కాకినాడ క్రైం: నిత్యం కిటకిటలాడే కాకినాడ ఆర్టీవో కార్యాలయ జంక్షన్‌లో ప్రచార ఆర్భాటం కోసం ఏర్పాటు చేసిన జనసేన నాయకుడి భారీ కటౌట్ ఎన్నికల కోడ్‌కు సవాలు విసురుతోంది. మార్చి 9న జరగనున్న ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న విషయం విదితమే. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని సమర్థంగా నిర్వహించాల్సిన ఎంసీసీ నోడల్ అధికారి, ఆయన బృందం కళ్లెదుటే ఉల్లంఘనలు జరుగుతున్నా తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కుడా చైర్మన్, జనసేన కాకినాడ జిల్లా అధ్యక్షుడు, పెద్దాపురం పార్టీ ఇన్‌చార్జి తుమ్మల రామస్వామి(బాబు) కటౌట్ వివాదాస్పదంగా మారింది. ఆ కటౌట్‌ను కొంతమేర కప్పి ఉంచినా, ముఖం స్పష్టంగా కనిపించేలా ఏర్పాట్లు చేశారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

ఘనంగా లయన్స్ 'స్నేహ పద్మం'



బెస్ట్ జోనల్ చైర్‌పర్సన్ అవార్డు అందుకుంటున్న గరికిపర్తి

నాగమల్లితోట జంక్షన్(కాకినాడ సిటీ): లయన్స్ రీజినల్ కాన్ఫరెన్స్ స్నేహ పద్మం ఆదివారం స్థానిక సూర్యకళా మందిరంలో ఆర్‌సీ లయన్ పద్మతులసి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. క్లబ్ కాకినాడ స్టార్స్‌కు సర్వీస్ అవార్డులతో పాటు, ప్రతిష్ఠాత్మక లయన్ ఆఫ్ ది రీజియన్ అవార్డును స్టార్స్ సభ్యులు లయన్ వీఎస్‌ఆర్ మూర్తి అందుకున్నారు. 316బి పేరున లయన్స్ క్లబ్ కాకినాడ స్టార్స్ సభ్యుల సహకారంతో నిర్మించిన ఫంక్షన్ హాల్‌కు గుర్తింపుగా మరో అవార్డును మూర్తి అందుకున్నారు. బెస్ట్ జోనల్ చైర్‌పర్సన్ అవార్డును గరికిపర్తి నమఃశివాయ పొందారు. బెస్ట్ కార్యదర్శి అవార్డును ఇంద్రగంటి నాగేశ్వరి అందుకున్నారు. ఆయా అవార్డులను పద్మతులసి దంపతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో కాకినాడ స్టార్స్ ప్రెసిడెంట్ షర్మిల, కార్యదర్శి నాగేశ్వరి, ట్రెజరర్ గరికిపర్తి నాగమణి, అడ్మిన్ నాయుడు, గణేష్, గంగాధర్, నాగిని, గాంధీ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం




శిబిరంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

బోట్‌క్లబ్: నగరంలోని సంతచెరువు పార్కులో ఆదివారం సంత చెరువు వాకింగ్ ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. రమణ క్లినికల్ లేబరేటరీ అధినేత లింగమల్లు కృష్ణమూర్తి సౌజన్యంతో ఈ ఉచిత వైద్య శిబిరం జరిగింది. సుమారు 150 మంది రోగులకు సుగర్, బీపీ పరీక్షలు ఉచితంగా నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాబోలు పున్నయ్య, చెక్కా శ్రీనివాస్, తెలుగుంట సుబ్రహ్మణ్యం, చెక్కా రమేష్ పాల్గొన్నారు.

ప్రతి రైతుకు విశిష్ట గుర్తింపు సంఖ్య

కరప: రైతు సేవా కేంద్రంలో భూమి ఉన్న ప్రతి రైతు వివరాలు నమోదు చేయించుకుని విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలని ఎంఏఓ ఏవీ రాజేష్ కోరారు. కరపలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రభుత్వం అమలు చేసే పథకాల ద్వారా ప్రయోజనం చేకూరాలన్నా, పంట బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ, వ్యవసాయ సంబంధ సేవలు పొందాలన్నా ఈ విశిష్ట గుర్తింపు సంఖ్యనే ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. రైతులు ఆధార్, దీనితో అనుసంధానమైన మొబైల్, భూమి రికార్డుల వివరాలుండే పట్టాదార్ పాసు పుస్తకాలు కానీ, 1బీ ఫారంతో సమీపంలోని రైతు సేవా కేంద్రానికి వెళితే అక్కడి సిబ్బంది నమోదు చేస్తారని వివరించారు. ఈ నెల 25లోగా ఆర్‌ఎస్‌కేలో నమోదు చేయించుకుని, విశిష్ట గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.

శేష వాహనంపై శ్రీవారు



ప్రత్యేకాలంకరణలో వేంకటేశ్వరస్వామి

బోట్‌క్లబ్: భూదేవి, శ్రీదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవాల సందర్భంగా స్థానిక జగన్నాథపురంలో ఆదివారం స్వామివారు శేష వాహనంపై ఊరేగారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు పంచామృతాభిషేకాలు వైభవంగా జరిగాయి. ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యవేణి పాల్గొన్నారు.

భావనారాయణా నమోస్తుతే..

- భక్తులతో కిటకిటలాడిన సర్పవరం ఆలయం



ఆలయ ప్రాంగణంలో పొంగలి తయారీకి కిక్కిరిసిన భక్తులు

కాకినాడ రూరల్: పురాతన ప్రసిద్ధిగాంచిన సర్పవరంలోని రాజ్యలక్ష్మి సమేత భావనారాయణ స్వామి ఆలయానికి మాఘ మాసం ప్రత్యేకం. ఇక్కడ మాఘమాసంలో ఆదివారాలు తిరునాళ్లు నిర్వహించడం ఆనవాయితీగా వస్తుంది. జిల్లా నలుమూలల నుంచి భక్తులు వేలాదిగా తరలి వచ్చి ముక్తికా సరస్సులో స్నానాలు చేసి, ఆలయ ప్రాంగణంలో ఆవు పిడకలతో నిచ్చెలి వేసి, నిప్పుపై ఆవు పాలతో పొంగలిని మహిళలు స్వయంగా తయారు చేస్తారు. దీనిని ఆరోగ్య ప్రదాతగా కొలిచే సూర్య భగవానునికి నైవేద్యంగా సమర్పిస్తారు. అనంతరం భావనారాయణ స్వామివారి దర్శనం చేసుకుని తరిస్తారు. మాఘ మాసం రెండో ఆదివారం సందర్భంగా సర్పవరం ఆలయానికి తెల్లవారుజాము నుంచి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. భక్తుల కోసం క్యూ లైన్లను ఏర్పాటు చేశారు. ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో దేవదాయ శాఖ అధికారులు భక్తులకు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ముక్తికా సరస్సు వద్ద భక్తుల స్నానాల కోసం జలధారను ఏర్పాటు చేశారు. ఆలయానికి వేలాదిగా వచ్చిన భక్తులకు గ్రామానికి చెందిన దూళిపూడి గొల్లబాబు, రాజేష్ ఆర్థిక సహకారంతో పుల్ల శ్రీరాములు ఆధ్వర్యంలో ఉచితాన్నదానం నిర్వహించారు.



సర్పవరం ఆలయంలో స్వామివారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



ముక్తికా సరస్సులో భక్తుల స్నానాల కోసం ఏర్పాటు చేసిన జలధార



ప్రత్యేకాలంకరణలో భావనారాయణ స్వామివారు